

నోట్లే... ఓట్లు





- కోట్ల కట్టలు తెగుతున్నాయి
- పోలింగ్ తేదీ దగ్గరపడ్డంతో కోనసీమ జిల్లాలో అధికార వైసీపీకి ఓటమి జ్వరం
- ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో ఎదురీదుతున్న ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు
- కూటమి స్పీడు, ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో చెల్లాచెదురవుతున్న ఓట్లు
- ఎలాగైనా విజయానికి చేరువ కావడం కోసం భారీగా నోట్లు వెదజల్లుతున్న వైనం



కొత్తపేటలో చీరల పంపిణీ

- మండపేట, కొత్తపేట, పి.గన్నవరం, రాజోలుల్లో యథేచ్ఛగా పంపకాలు
- ఓట్లు వేయించాలంటూ అంగన్వాడీలు, ఆర్ఎంపీలకు రూ.5వేల చొప్పున పంపిణీ
- వృద్ధులు, దివ్యాంగ ఓటర్ల వద్దకు వెళ్లి రూ.1,500 నుంచి రూ.2వేల వరకు అందజేత
- తటస్థ ఓటర్లను జల్లెడపట్టి రూ.2వేల వరకు పంపకాలు
- అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రపురం నియోజకవర్గాల్లో సామాజికవర్గాల వారీగా రేట్లు
- ఇతర జిల్లాల నుంచి బృందాలు తీసుకొచ్చి బాధ్యత అప్పగింత

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు ఇంక నాలుగు రోజులే ఉండడంతో జిల్లాలో అధికార వైసీపీకి ఓటమి జ్వరం పట్టుకుంది. ఏ నియోజకవర్గంలో చూసినా పార్టీపై ఓటర్లలో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తుండడంతో అనుకూల ఫలితాలపై నమ్మకం సడలుతోంది. ఎంత ప్రచారం చేసినా వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహం మినహా సానుకూల ఛాయలు కనిపించకపోవడంతో అభ్యర్థులకు ఏమీ పాలుపోవట్లేదు. ఒక పక్క కూటమి స్పీడు, మేనిఫెస్టో ప్రభంజనం, అటు ఫ్యాన్‌పై వ్యతిరేకతతో ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయం వెన్నాడుతోంది. దీంతో ఎక్కడికక్కడ కోట్లలో నోట్ల కట్టలకు పని చెప్తున్నారు. ఎంతకైనా తెగించి ఓట్లు కొనేందుకు సిద్ధపడుతున్నారు. వ్యతిరేకత తీవ్రంగా ఉన్న గ్రామాలకు ఒక రేటు, ఒక్కో సామాజికవర్గానికి ఒక్కో రేటుతో ఓటర్లను తీవ్రస్థాయిలో ప్రలోభాలకు గురిచేస్తున్నారు. మండపేట, ముమ్మిడివరం, రాజోలు, కొత్తపేటల్లో రెండు రోజుల కిందటే పంపకాలు ప్రారంభించారు. గంపగుత్తగా ఓట్లు వేయించేలా అంగన్వాడీలు, ఆర్ఎంపీలకు రూ.5వేలు చొప్పున పంచేశారు. వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి రూ.2వేలు ఇచ్చారు. రామచంద్రపురం, పి.గన్నవరం, అమలాపురంల్లో పంపకాలకు తెర తీశారు.

ఓటమి భయంతో అడ్డదార్లు...

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు వైసీపీకి వణుకు పుట్టిస్తున్నాయి. ఏ నియోజకవర్గం చూసినా గెలుస్తామనే నమ్మకం కనిపించకపోవడంతో అభ్యర్థులు దిక్కుతోచక విలవిల్లాడుతున్నారు. ప్రజల్లో ప్రచారానికి వెళ్తున్నా వారి నుంచి సానుకూల స్పందన రాకపోవడం గ్రహించి దెబ్బయిపోతున్నట్లు ముందుగానే పసిగడుతున్నారు. దీంతో చేసేదిలేక ప్రలోభాలనే నమ్ముకుని ముందుకు సాగుతున్నారు. ఈరకంగానైనా ఎంతోకొంత ఓట్లు సాధించేందుకు అడ్డదార్లు తొక్కుతున్నారు. వాస్తవానికి కొన్ని వారాల కిందట వరకు జిల్లాలో మూడుసీట్ల వరకు రావొచ్చని వైసీపీ అంచనా వేసింది. కానీ కూటమి స్పీడు పెంచడం, చంద్రబాబు, పవన్ పోటీపోటీగా జిల్లాను చుట్టేయడం, అటు మేనిఫెస్టో అదుర్స్ అనిపించుకోవడంతో వైసీపీ నమ్మకం పెట్టుకున్న సీట్లు కూడా చేజారిపోయే పరిస్థితి. ఈ నేపథ్యంలో కూలుతున్న కోటను కాపాడుకునేందుకు పలు నియోజకవర్గాల్లో ఆయా అభ్యర్థులు నోట్ల కట్టలకు పని చెప్పారు. డబ్బుతో అయినా ఏదోలా గట్టెక్కవచ్చనే ఆశతో డబ్బులు పంపిణీ చేస్తున్నారు. మండపేటలో ఎలాగైనా పాగా వేయాలనే లక్ష్యంతో తోట త్రిమూర్తులు అనుచరులు బరి తెగించేస్తున్నారు. సదరు నేతకు ప్రచారంలో ఎక్కడా ఆదరణ రాకపోవడం, ఇటీవల శిరోముండనం కేసులో శిక్షపడ్డంతో డ్యామేజీ అధికంగా ఉండడంతో కోట్ల కట్టలనే నమ్ముకున్నారు. ఓటుకు రూ.2వేలకుపైగా పంపిణీకి సిద్ధమయ్యారు. ఇప్పటికే నియోజకవర్గంలోని అంగన్వాడీ కేంద్రాల్లో కొందరు ఆయాలు, పలుకుబడి కలిగిన ఆర్ఎంపీ వైద్యులకు రూ.5వేల చొప్పున వైసీపీ పంపిణీ చేసింది. ఈ నియోజకవర్గంలో ఎలాగైనా గెలవాలన్న తలంపుతో సదరు నేత రూ.30కోట్లకు పైగా పంచడానికి సిద్ధపడ్డారు.

రామచంద్రపురంలో టీడీపీ విజయానికి దగ్గరవడంతో వైసీపీ అడ్డదార్లు తొక్కుతోంది. ప్రధానంగా కీలకంగా ఉన్న శెట్టిబలిజ, కాపు సామాజికవర్గాల ఓటర్లకు రూ.1,500 చొప్పున పంచడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. మండపేట వైసీపీ అభ్యర్థి సైతం ఇక్కడ తన పట్టు చూపించేందుకు డబ్బు, మద్యం విచ్చలవిడిగా పారించేందుకు పన్నాగాలు పన్నారు. టీడీపీ అభ్యర్థి సుభాష్ తరఫున పనిచేసే ముఖ్య అనుచరులపై పాత కేసులు గుర్తుచేస్తూ పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారు. మరోపక్క కోడ్ ఉల్లంఘించి నియోజకవర్గ వ్యాప్తంగా వలంటీర్లు, పార్టీ కార్యకర్తల ద్వారా ఇంటింటికీ వెళ్లి జగన్ స్టిక్కర్లు అతికిస్తున్నారు. వ్యతిరేకించిన వారిని పింఛన్లు తీసేస్తామని బెదిరిస్తున్నారు. టీడీపీ నేతలు ఆర్వోకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గ్రామానికో రేటు...

- ముమ్మిడివరంలో ఎమ్మెల్యే పొన్నాడ గ్రామాలవారీగా ఓట్లకు రేట్లు కట్టారు. దళిత గ్రామాల్లో వెయ్యి ఇతర సామాజికవర్గాలకు రూ.1,500, టీడీపీ కంచుకోట గ్రామాల్లో తటస్థ ఓటర్లకు రూ.2వేల వరకు పంపిణీ చేస్తున్నారు.
- కొత్తపేటలో ఓటమి ఖాయమని తెలుస్తుండడంతో జగ్గిరెడ్డి అనుచరులు నోట్లకట్టలనే నమ్ముకున్నారు. లంక గ్రామాలకు వెళ్లి మరీ డబ్బులు, చీరలు పంపిణీ చేస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రాజీనామా చేసిన వలంటీర్లు, వైసీపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పసుపు, కుంకుమ, చీర, స్టిక్కర్‌తో కూడిన ప్యాకెట్‌ను ఓటర్లకు అందించి వైసీపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. కొత్తపేట, ర్యాలిలతో పాటు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో చీరల పంపిణీ జరిగింది. కొన్నిచోట్ల చీరలు తీసుకునేందుకు ఓటర్లు నిరాకరించారు. మరికొన్నిచోట్ల చీరలను గుమ్మంలో పెట్టి వెళ్లిపోయారు.
- అమలాపురం, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లో రూ.1,500 చొప్పున రేటు ఖరారు చేశారు. తొలుత గ్రామీణ ప్రాంతాల్లో మంగళవారం నుంచి డబ్బులు వెదజల్లుతున్నారు. అయితే డబ్బులు పంచుతున్నా కొందరి అభ్యర్థుల్లో విజయం నమ్మకం సడలిపోయింది. జగన్ సర్కారుపై తీవ్ర వ్యతిరేకత, కూటమి ప్రభావం తమను ముంచడం ఖాయమని వీరంతా అప్పుడే ఓ నిర్ణయానికి వచ్చేశారు.

నియోజకవర్గానికి 40 మంది...

జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని నియోజకవర్గాలకు వైసీపీ ఇతర జిల్లాల నుంచి తీసుకువచ్చిన నేతలకు డబ్బు పంపిణీ బాధ్యతలు కట్టబెట్టింది. ప్రధానంగా నెల్లూరు, రాయలసీమ నుంచి కొన్ని బృందాలను దించింది. ఒక్కో నియోజకవర్గానికి 40మంది చొప్పున మనుషులను కేటాయించి డబ్బు, మందు పంపిణీ చేయిస్తోంది. వీరంతా కొన్ని రోజుల కిందట లాడ్జీలు, హోటళ్లలో దిగారు. తక్కువ రేటుకు వచ్చే పాత ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేసి రాత్రివేళల్లో బరితెగించి ఇచ్చిన చిరునామాలో డబ్బులు అందిస్తున్నారు.

ఇదిలా ఉంటే కొన్ని నియోజకవర్గాల్లో ఏకంగా ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందికి వైసీపీ నేతలు రూ.50వేల వరకు నజరానాలు అందించారు. ఉదయం నుంచి రాత్రి వరకు యథేచ్ఛగా డబ్బు పంచినా అటువైపు కన్నెత్తి చూడకుండా దారిలోకి తెచ్చుకున్నారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు జిల్లాలో గోదావరి వెంబడి మండలాలు, గ్రామాల్లో వైసీపీ నేతలు నేరుగా ఇళ్లకు వెళ్లి డబ్బులు పంచారు. కానీ ఏ ఒక్కరు కూడా తనిఖీ బృందాలకు కనిపించకపోవడం విశేషం.



ఆత్రేయపురంలో ఇంటింటికి చీరలు పంపిణీ చేయడానికి వెళ్తున్న బృందం

ఊరెళ్లాలి.. ఓటెయ్యాలి!

ఓట్ల పండుగకు వస్తున్నారు..



ఊరెళ్లాలి..ఓటెయ్యాలి.. అందరి ఆశ ఇదే.. గోదావరి జిల్లా వాసులంతా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు.. వ్యాపారాలు.. ఉద్యోగాలు చేసుకుంటూ సుదూరంగా ఉండిపోయారు. ఒక్క మలికిపురం నియోజకవర్గం నుంచే సుమారు 6వేల మంది హైదరాబాద్‌లో ఉన్నట్టు సమాచారం.. దాదాపు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల పరిధిలోని 22 నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి..అమెరికా, ఆస్ట్రేలియా, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో స్థిరపడ్డారు.. అయితే ఈ నెల 13వ తేదీన పోలింగ్ కావడంతో ఆయా ప్రాంతాల నుంచి తిరిగి స్వగ్రామాలకు చేరుతున్నారు. ఇప్పటికే రైళ్లు, బస్సులు, విమానాలకు రిజర్వేషన్లు ఫుల్ అయిపోయాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొంతమంది మాత్రం తమ సొంత వాహనాల్లో తరలివస్తున్నారు. ఎన్నడూ లేనిది సంక్రాంతికి పండుగకు వచ్చినట్టు ఓట్ల పండుగకు ఊరెళ్లాలి..ఓటెయ్యాలి అంటూ పెద్ద ఎత్తున పల్లెబాట పట్టారు.

- పల్లెకు పోదాం.. ఓటును వేద్దాం చలోచలో..
- తెలంగాణ నుంచి తరలివస్తున్న ఓటర్లు
- హైదరాబాద్, బెంగళూరు, చెన్నై రైళ్లకు రిజర్వేషన్లు ఫుల్
- స్వస్థలాలకు వచ్చేందుకు ఎన్ఆర్ఐల ఆసక్తి
- బస్సు చార్జీలు పెంపు
- విమాన చార్జీలూ అంతే
- పలు నియోజకవర్గాల్లో వలస ఓటర్లకు ప్రత్యేక బస్సులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)/పిఠాపురం/ముమ్మిడివరం/రాజమహేంద్రవరం అర్బన్, మే 8: అన్ని రూట్లు ఓటు వైపే వస్తున్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారితో పాటు విదేశాల్లో స్థిరపడిన ప్రవాసాంధ్రులు సైతం ఓటు వేసేందుకు స్వస్థలాలకు వచ్చేస్తున్నారు. గతంలో జరిగిన ఎన్నికలతో పోల్చుకుంటే ఇలా వచ్చేవారి సంఖ్య రెండు రెట్ల కంటే అధికంగా ఉండే అవకాశం ఉంది. ఇప్పటికే రైళ్లలో రిజర్వేషన్లన్నీ ఫుల్ కాగా బస్సు, విమాన టిక్కెట్ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. కొన్ని అసోసియేషన్లు ఇప్పటికే ఉద్యోగుల కోసం ఉచితంగా బస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించినా అవి పూర్తిస్థాయిలో సరిపోవడం లేదు. వీటితోపాటు ప్రధాన పార్టీల అభ్యర్థులు హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వలస ఓటర్లపై దృష్టిసారించి ప్రత్యేకంగా బస్సులు పురమాయిస్తున్నట్టు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారడం, ఏపీని కాపాడుకోవాలన్న లక్ష్యం ప్రతి ఒక్కరిలోనూ అధికమైన నేపథ్యంలో వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఈసారి స్వస్థలాల్లో ఓటు వేయాలనే కృతనిశ్చయానికి వచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి అత్యధికంగా హైదరాబాద్, సికింద్రాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబయి, పుణే తదితర ప్రాంతాల్లో ఎక్కువగానే ఉన్నారు. ప్రవాసాంధ్రుల ఓట్లు కూడా ఈ ఎన్నికల్లో కీలకంగా మారాయి. ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు ఫోన్ల ద్వారా వీరిని సంప్రదించి ఓటు వేసేందుకు రావాలని కోరారు. ఇప్పటికే వీరు ఓటు వేసేందుకు స్వస్థలాలకు రావాలని నిర్ణయించుకోవడం, శని, ఆదివారాలు సెలవు కావడం, పోలింగ్ జరిగే మే 13న సెలవు ప్రకటించడంతో ఇంటికి వచ్చి మూడు రోజులు గడిపినట్టు ఉంటుందని అందరూ ప్రయాణాలకు సిద్ధమయ్యారు.

రైళ్లన్నీ ఫుల్

13న పోలింగ్ కావడంతో వచ్చే వారంలో రైళ్లలో రిజర్వేషన్లు ఇప్పటికే నిండుకున్నాయి. తెలంగాణలోని హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి రాజమహేంద్రవరం, సామర్లకోట, పిఠాపురం, అన్నవరం, తుని వచ్చే రైళ్లలో రిజర్వేషన్లు అన్నీ ఇప్పటికే ఫుల్ అయ్యాయి. చెన్నై, బెంగళూరు నుంచి వచ్చే రైళ్లలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఎన్నికల పోలింగ్ 13వ తేదీ కాగా.. 11న రెండో శనివారం, 12న ఆదివారం సెలవులు కలిసి రావడంతో సికింద్రాబాద్ నుంచి 10వ తేదీ నుంచి జిల్లాకు వచ్చే రైళ్లలో రిజర్వేషన్లు అయిపోయాయి. 10,11,12 తేదీల్లో వందే భారత్ 170, విశాఖ వందేభారత్ 133, షాలిమార్ వీక్లీ 172, షిర్డీ 120 వెయిటింగ్ లిస్ట్ ఉంది. ఉమ్మడి జిల్లావాసులు హైదరాబాద్‌కి ఎక్కువగా రాకపోకలు సాగించే గోదావరి, ఫలక్‌నుమా, గౌతమి ఎక్స్‌ప్రెస్‌ల్లో 400 వెయిటింగ్ లిస్ట్ ఉండగా.. 11, 12, గౌతమికి రిజర్వేషన్లు లేవు. కోకనాడ ఎక్స్‌ప్రెస్ వెయిటింగ్ లిస్ట్ 180 దాటింది. గరీబ్‌రథ్‌కు 10న అసలు రిజర్వేషన్లు లేవు. 11న 300, 12న 295 వెయిటింగ్ లిస్టు ఉంది. కోణార్క్‌కి 12 వరకు రిజర్వేషన్లు అయిపోయాయి.

ఎన్ఆర్ఐలు వస్తున్నారు..



ఈ సారి ఎన్నికల్లో విదేశాల్లో ఉంటున్న జిల్లాకు చెందిన వారు ఓటు వేసేందుకు ప్రత్యేకంగా స్వస్థలాలకు వస్తున్నారు. వీరు ముందుగానే టిక్కెట్లు రిజర్వ్ చేసుకుని విమానాల్లో వచ్చి ఓటు వేసి కుటుంబసభ్యులు, తల్లిదండ్రులతో వారం పది రోజులు గడిపేలా ఏర్పాట్లు చేసుకున్నారు. అమెరికా, ఇంగ్లండ్, ఐర్లాండ్, ఆస్ట్రేలియా, దుబాయ్‌తో పాటు గల్ఫ్ దేశాల నుంచి అధికంగా వస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గానికి చెందిన వారే సుమారు వెయ్యి మంది వరకూ ఓటు వేసేందుకు స్వదేశానికి వస్తున్నట్టు చెబుతున్నారు. దీంతో జిల్లాలో ఉన్న రాజమహేంద్రవరం మధురపూడి ఎయిర్‌పోర్ట్ గత వారం రోజులుగా కిటకిటలాడుతోంది. రాష్ట్రంలో గత ఐదేళ్లల్లో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు, సంఘటనలు అందరినీ కలచివేయడంతో పాటు ఇలాగే ఉంటే మన భావితరాల భవిష్యత్తు ఏమిటనే ఆలోచన అందరినీ ఓటు వేయాలనే సంకల్పం వైపు నడిపిస్తున్నట్టు పలువురు చెబుతున్నారు. గతంలో ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు కేవలం 20 నుంచి 40 శాతం మంది మాత్రమే వచ్చి ఓటు వేసేవారు. ఈసారి అది 80-90 శాతం వరకూ ఉంటుందని అంచనా.

ఎన్నికల కోసం ఆర్టీసీ బస్సులు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ నుంచి రాష్ట్రానికి తరలివచ్చే ఓటర్ల కోసం ఆర్టీసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఈనెల 9వ తేదీ నుంచి సికింద్రాబాద్-హైదరాబాద్ ప్రాంతాల నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు ఈ స్పెషల్ సర్వీసులు ప్రారంభమవుతున్నాయి. ముందుగా తెలంగాణ రాష్ట్రం నుంచి ఓటర్లను ఇక్కడకు తీసుకురానున్నారు. 13న పోలింగ్ ముగిసిన తర్వాత కూడా మరో రెండు, మూడు రోజులు ఈ ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఈ స్పెషల్ సర్వీసులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నారు. హైదరాబాద్‌కు రెగ్యులర్‌గా నడిచే సర్వీసులకు ఈ స్పెషల్ సర్వీసులు అదనం కానున్నాయి. స్పెషల్ సర్వీసులకు టిక్కెట్ ధరలు సాధారణంగానే ఉంటాయని, అదనపు చార్జీలు వసూలు చేయట్లేదని ఆర్టీసీ డీఎం షబ్నం తెలిపారు.

ప్రత్యేక బస్సుల ఏర్పాటు

వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ సహా వివిధ అసోసియేషన్లు బస్సు సౌకర్యం ఏర్పాటు చేశాయి. పిఠాపురంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేస్తున్న నేపథ్యంలో ఐటీతో వివిధ సంస్థల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న ఉద్యోగులు తమ సొంత ఖర్చులతో కార్లు, ఇతర వాహనాలను ఓటు వేసేందుకు వచ్చే ఉద్యోగస్తుల కోసం ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే వీరితో వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసుకుని సమాచారాన్ని పంచుకుంటున్నారు.

ప్రైవేటు బస్సుల చార్జీలు భారీగా పెంపు

రైళ్లలో రిజర్వేషన్లు ఫుల్ కావడంతో ప్రైవేట్ బస్సు ఆపరేటర్లు బస్సు చార్జీలను భారీగా పెంచేశారు. గతంలో రూ.750 నుంచి రూ.1,000 వరకు ఉన్న చార్జీలు ఇప్పుడు రూ.2,100 నుంచి రూ.3 వేల వరకూ పెరిగాయి. ఈ ధరల్లో కూడా టిక్కెట్‌లు అందుబాటులో ఉండని పరిస్థితి ఉంది. హైదరాబాదు నుంచి రాజమహేంద్రవరానికి సాధారణ రోజుల్లో రూ.3,500 ఉన్న విమాన టిక్కెట్ ధర 10,11,12 తేదీల్లో బుధవారం సాయంత్రానికి రూ.7,900 నుంచి రూ.9,000 వరకూ ఉన్నాయి. ఇవి మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైళ్లు, బస్సుల్లో తిరుగు ప్రయాణానికి టిక్కెట్లు అందుబాటులో లేకపోవడంతో ఎక్కువ మంది సొంత వాహనాలపై వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. రెండు, మూడు కుటుంబాలు కలిసి ఒకే వాహనంలో వచ్చే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పోలింగ్ రోజున మాత్రం రిజర్వేషన్లు ఖాళీ ఉండడం గమనార్హం. ఉమ్మడి జిల్లాల్లోని ముఖ్యంగా సామర్లకోట, కాకినాడ, రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్‌కి 13, 14 తేదీల్లో విపరీతమైన రద్దీ ఉంది.

వలస ఓటర్లపై ప్రత్యేక దృష్టి

ప్రస్తుత ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు, వైసీపీ అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొని ఉండడంతో అభ్యర్థుల విజయాన్ని ప్రభావితం చేయడంలో వలస ఓటర్లు కీలకం కానున్నారు. దీంతో వలస ఓటర్లపై దృష్టి సారించిన అభ్యర్థులు తమకు అనుకూలమైన ఓటర్లను కూడగట్టే ప్రయత్నాలు చేపట్టారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి తెలంగాణలోని హైదరాబాద్, సికింద్రాబాద్, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్ ప్రాంతాలకు జీవనోపాధికి వలస వెళ్లిన వారు ఉన్నారు. సికింద్రాబాద్, హైదరాబాద్‌ల్లో అధికంగా ఉంటున్నారు. టిఫిన్ సైకిళ్లు, హోటళ్లు, ఇళ్లల్లో పనులు, అపార్టుమెంట్లలో, భవన నిర్మాణ కార్మికులు, చిన్న ఉద్యోగాలు చేస్తూ ఎక్కువ మంది జీవిస్తున్నారు. మరికొందరు వ్యాపారాలు చేస్తున్నారు. ఈ వలస ఓటర్లను రప్పించే ప్రయత్నాలు ఆయా నియోజకవర్గాల అభ్యర్థులు ముమ్మరం చేశారు. సామాన్య ఓటర్లకు ప్రత్యేక బస్సులు, ప్యాకేజీలు సిద్ధం చేస్తున్నారు. అక్కడి నుంచి వచ్చే ఓటరుకు బస్సు చార్జీలు చెల్లిస్తున్నట్టు సమాచారం. ఉభయ గోదావరి జిల్లాల్లోని ఒక్కో నియోజకవర్గంలో 8వేల మందికిపైగా వలస ఓటర్లు తెలంగాణలో ఉండడంతో వారి ఓట్లు అభ్యర్థి గెలుపుకు కీలకమయ్యే అవకాశం గెలిపిస్తుంది. దీంతో ఆయా పార్టీలు సానుకూల ఓటర్లను ఓటింగ్‌కు రప్పించే చర్యలు చేపట్టారు.



నెల కిందటే ప్లాన్ చేసుకున్నా...

నా పేరు వంశీ.. మాది అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం.. నేను బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నా.. నెల కిందటే ఎన్నికలకు వచ్చేందుకు ప్లానింగ్ చేసుకున్నా.. అందుకే ముందస్తుగా రిజర్వేషన్ చేయించుకున్నా.. నేను బుధవారం రావులపాలెం వచ్చేశా.. నాతో పాటు రాజమహేంద్రవరం, తునికి చెందిన స్నేహితులు ఉన్నారు.. 12వ తేదీకి వచ్చేందుకు ప్లానింగ్ చేసుకున్నారు. అయితే వారికి రిజర్వేషన్ లేదు.. ఎలా వస్తారో చూడాలి మరి.

- గంగిదేశి వంశీ మణికంఠ, రావులపాలెం



తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తా

రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి
దేవ వరప్రసాద్

రాజోలు నియోజకవర్గంలో అధికంగా ఉన్న తాగునీటి ఎద్దడి సమస్యను తీరుస్తా. ఎస్సీ, బీసీ, ఓసీ వర్గాల నుంచి మంచి స్పందన లభిస్తోంది. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, మురుగు కాల్వలు అధ్వానంగా ఉన్నాయి. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని అభివృద్ధి చేస్తాను. నేను పుట్టిన గడ్డకు సేవలందిస్తాను. అవినీతిని ప్రోత్సహించను. రాజోలుకు డయాలసిస్ సెంటరు తీసుకొస్తా. ప్రజా సమస్యలను పరిష్కరిస్తాను అంటున్నారు రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్... ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూ... 7లో

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యం

- నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం
- పి.గన్నవరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ

అయినవిల్లి, మే 8: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమని పి.గన్నవరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. నియోజకవర్గంలో తీర ప్రాంత రక్షణకు ప్రాధాన్యమిస్తూ నదీకోత నివారణకు గ్రోయిన్లు, రివిట్‌మెంట్లు ఏర్పాటుకు కృషి చేస్తాను. ప్రధాన సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తాను. మండల పరిధిలోని మాగాం, అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం గ్రామాల్లో కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌తో కలిసి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. గ్రామాల్లో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఇంటింటా ప్రచారంలో భాగంగా కూటమి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. తనకు, హరీష్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, సలాది పుల్లయ్యనాయుడు, గంగుమళ్ల కాశీఅన్నపూర్ణ, సయ్యపురాజు సత్యనారాయణరాజు, వేటుకూరి రమేష్‌రాజు, కళ్లేపల్లి సుబ్బరాజు, అడ్డగళ్ల రాంబాబు, నక్కా వెంకటేశ్వరరావు, వస్కా శ్యామ్‌సుందర్, బొబ్బిలి అయ్యప్ప, రాంబాబు, పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, మద్దాల సుబ్బారావు, మట్టపర్తి రాజేశ్వరరావు, కుడుపూడి బుజ్జి, సలాది బుచ్చిరాజు, సలాది బాబూరావు, జంగా డేవిడ్‌రాజు, పంతాడి శ్రీనివాసరావు, వడ్రే శేషు తదితరులు పాల్గొన్నారు. మండల పరిధిలోని సిరిపల్లి, వీరవల్లిపాలెం గ్రామాలకు చెందిన పలువురు వైసీపీని వీడి కూటమిలో చేరారు. కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.



అయినవిల్లిలంకలో ఓట్లు అభ్యర్థిస్తున్న గిడ్డి సత్యనారాయణ, చిత్రంలో అమలాపురం లోక్‌సభ అభ్యర్థి హరీష్



మాగాంలో మోటారు సైకిలుపై ప్రచారం



అయినవిల్లిలంక రోడ్‌షోలో హరీష్, సత్యనారాయణ



బూత్ క్యాప్చరింగ్‌కు పాల్పడితే జైలుకే

పెద్దాపురం, మే 8: ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాన్ని స్వాధీనం చేసుకోవడం అధికారులను బెదిరించి బ్యాలెట్ పేపర్లు, ఈవీఎంలు స్వాధీనం చేసుకోవడాన్ని బూత్ క్యాప్చరింగ్ అంటారు. ఈవీఎంలు ధ్వంసం చేయడం, విరగ్గొట్టడం, ఎన్నికల గుర్తులపై సిరా పొయ్యడం, వంటి విధానాలు ఇందులో భాగమే. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లను భయపెట్టడం, పోలింగ్‌ను అడ్డుకోవడం నేరం. ప్రభుత్వ సిబ్బంది ఇలాంటివి చేస్తే ఐపీసీ 1951 సెక్షన్ 135 ఏ, 135 ప్రకారం మూడు నుంచి ఐదు సంవత్సరాలు జైలుశిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. ఇతరులు అయితే ఒకటి నుంచి మూడు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తారు.

రోజుకు 27 పైసలు

ఓటు హక్కును అమ్ముకునే వారు ఈ లెక్కలు చూడాలి

సామర్లకోట, మే 8: ఈ నెల 13న జరుగనున్న సాధారణ ఎన్నికలలో ఓటు హక్కును అమ్ముకునే వారు ఒకసారి ఆలోచించాలి. మన భవిష్యత్తుకు బాటలు వేసే ఆదర్శ ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు ఉపయోగించాల్సిన ఓటును అమ్ముకొని దుర్వినియోగం చేస్తే ఐదేళ్లు కష్టాలు ఎదుర్కోవాల్సిందే. పదికో పరక్కో ఓటును అమ్ముకుని అనర్హులకు ఓటు ఆయుధాన్ని అందించవద్దు. మనం వేసే ఓటు ఐదేళ్లు సుస్థిర ప్రభుత్వం అందరి సంక్షేమం కాంక్షించే విధంగా ఉండాలి. ఓటుకు రాజకీయ పార్టీలు ఇచ్చే మొత్తం ఐదేళ్లకూ లెక్కిస్తే రోజుకు ఎంతవుతుందో ఒక్కసారి గమనించాలి.

ఏడాదికి 365 రోజుల చొప్పున ఐదేళ్లకు 1825 రోజులు..

ఓటుకు వారు ఇచ్చే మొత్తం రోజువారీ లెక్కిస్తే..

రూ. 500 ఇస్తే రోజుకు రూ. 0.27 పైసలు అవుతుంది. రూ.1000 ఇస్తే రోజుకు రూ. 0.56 పైసలు, రూ. 1,500 ఇస్తే రోజుకు రూ.0.82 పైసలు, రూ. 2,000 ఇస్తే రోజుకు రూ.1.10 పైసలు అవుతుంది. రూ. 2,500 ఇస్తే రోజుకు రూ. 1.37 పైసలు మాత్రమే మనకు వస్తుంది. ఒకవేళ రూ. 3,000 ఇస్తే రోజుకు రూ.1.65 పైసలు మనకు ఇచ్చినట్లు.. మరి రూ. 4,000 ఇచ్చారనుకోండి రోజుకు రూ. 2.20 పైసలు అవుతుంది. రూ. 5,000 ఇస్తే రోజుకు రూ. 2.74 పైసలు మాత్రమే నాయకుడు మనకు ఇచ్చినట్లు.. చూసారా మన విలువ పైసలతో సమానం అన్నమాట..



బండారుతో వెంకటేశ్వరరావు

కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఎన్‌ఆర్‌ఐ ప్రచారం

ఆలమూరు, మే 8: కూటమి అభ్యర్థుల విజయం కోసం ఎన్ఆర్ఐలు రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో జోరుగా ప్రచారం సాగిస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చెముడులంక గ్రామానికి చెందిన రాయుడు వెంకటేశ్వరరావు ఉద్యోగరీత్యా బహ్రెయిన్‌లో స్థిరపడ్డారు. జనసేన కన్వీనర్‌గా ఉన్న ఆయన ఇక్కడకు వచ్చి రెండు నెలలుగా రాష్ట్రంలో కూటమి అభ్యర్థుల విజయం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. సొంత నియోజకవర్గమైన కొత్తపేటలో టీడీపీ అభ్యర్థి బండారు సత్యానందరావు, పిఠాపురంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్, రాజమహేంద్రవరం లోక్‌సభ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. చంద్రబాబునాయుడు అధ్వర్యంలో ఇటీవల విజయవాడలో జరిగిన ఎన్ఆర్ఐల సమావేశంలోనూ పాల్గొన్నారు. చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ పిలుపునకు స్పందించి కూటమి అభ్యర్థుల విజయానికి తన వంతు కృషి చేస్తున్నట్టు రాయుడు వెంకటేశ్వరరావు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి చెప్పారు.



- ఓటుకు వైసీపీ రేటు రూ.2,500
- కొన్ని చోట్ల రూ.3 నుంచి 4వేలు కూడా
- వీధుల్లో పంపిణీ మొదలైంది..
- అంతా బహిరంగమే
- జనంలో పట్టులేకపోవడంతో డబ్బుపై ఆధారపడిన వైసీపీ
- పగలు, రాత్రి పంపిణీ పనిలోనే నాయకులు

ఓ వైపు సర్వేలు.. మరోవైపు జననాడి.. కూటమి విజయ ప్రభంజనం తప్పదని స్పష్టం చేస్తుండడంతో వైసీపీ పెద్ద సంఖ్యలో ఓట్ల కొనుగోలుపై ఆధారపడింది. పోటీలో ఉన్న వైసీపీ అభ్యర్థులు లెక్కల నుంచి తప్పించిన కోట్లాది రూపాయల నల్లధనాన్ని ప్రజలకు పంచేస్తున్నారు. ద్వితీయ శ్రేణి నాయకులు రోజుకు రాజమహేంద్రవరం సిటీలో కొన్ని వార్డులను ఎంచుకొని పగలూ, రాత్రి అదే పనిమీద ఉంటున్నారు. వార్డుల్లో బహిరంగంగానే ఇదంతా జరుగుతున్నా యంత్రాంగం పసిగట్టలేకపోవడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి..

పంచేస్తున్నారు!



ఓట్ల కొనుగోలు మొదలుపెట్టిన వైసీపీ

రాజమహేంద్రవరం సిటీలో నగదు పంపిణీ

రాజమహేంద్రవరం, మే 8(ఆంధ్రజ్యోతి):

వీధుల్లోని వైసీపీ నాయకులకు నగదు పంపిణీ కార్యక్రమాన్ని వైసీపీ పెద్దలు అప్పగించారు. ఇప్పటికే రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో కొన్ని వార్డుల్లో పంపిణీ పూర్తయినట్లు తెలుస్తోంది. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత కుక్కర్లు, ఫ్యాన్లు, వంటసామగ్రి, డిన్నర్ సెట్లు, హాట్‌ప్యాక్‌లను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలకు పంపిణీ చేశారు. మహిళా దినోత్సవం, ఉగాది, శ్రీరామనవమిని చూపి వేలాది చీరలను విచ్చలవిడిగా ఇచ్చేశారు. ఇప్పుడు వీధుల్లో పంపకాలను మొదలు పెట్టారు. రెండు రోజుల నుంచీ ఈ తంతు నడుస్తోంది. బుధవారం రాజమహేంద్రవరంలోని క్వారీ మార్కెట్ ఏరియా, మల్లికార్జుననగర్, నారాయణపురం, పీఎల్‌పురం, ఇన్నీసుపేట, తాడితోట తదితర చోట్ల ఓటుకు రూ.2500 చొప్పున వైసీపీ పంచిపెట్టింది. వైసీపీకి చెందిన కార్యకర్తలు ఆయా ఇళ్లకు వెళ్లి ఓటరు స్లిప్పులు, ఓటరు కార్డు పరిశీలించి, ఫోన్ నంబరుతో సహా ఓటరు వివరాలను నమోదు చేసుకొని ఓటుకు రూ.2,500 ఇచ్చారు. ఒకే ఇంట్లో ముగ్గురు ఓటర్లు ఉన్నా రూ.10 వేలు ముట్టజెప్పారు. డబ్బులు ఇస్తున్నాం కాబట్టి ఓటు తమకే వేయాలని చెప్పారు. తమను కచ్చితంగా తిరస్కరిస్తారనే అనుమానం ఉన్నచోట్ల ఓటుకు రూ.3వేల నుంచి రూ.4వేల వరకూ చేతిలో పెట్టారు. డబ్బులతోపాటు వైసీపీ కరపత్రాలు, బ్యాలెట్ నమూనాలను అందజేస్తున్నారు.



ఎన్నికల షెడ్యూల్‌కి ముందు నుంచే ఆయా వార్డుల్లోని వైసీపీ నాయకుల ఇళ్లకు పెద్ద మొత్తంలో డబ్బులు చేర్చినట్లు తెలుస్తోంది. ఉదాహరణకు ఒక వార్డులోని 20 వీధులు ఉంటే రెండు, మూడు వీధులకు కలిపి ఒక వైసీపీ కార్యకర్త ఇంటి వద్ద డబ్బు ఉంచారు. ఇలా కోట్లాది రూపాయలను చేరవేశారు. ఆ డబ్బును ఓటర్లకు ఇచ్చే బాధ్యత ఆ వీధిలోని

వైసీపీ నేతల ఇళ్లల్లో డబ్బు

ఇద్దరు ముగ్గురు వైసీపీ కార్యకర్తలకు అప్పగించారు. నెల క్రితమే వైసీపీ కార్యకర్తల ఇళ్లకు డబ్బులు పంపించే తతంగం నడిచింది. అయితే, పోలింగ్ తేదీకి వారం ముందు నుంచీ మాత్రమే ఓటర్లకు డబ్బులు ఇవ్వాలని నిర్ణయించడంతో సోమవారం నుంచి ఓట్ల కొనుగోలును షురూ చేశారు. డబ్బులు పంపిణీ అయిన తర్వాత ఆయా ఓటర్లకు ఫోన్లు చేసి 'ప్యాను అందిందా?' అంటూ ఆరా తీస్తున్నారని చెబుతున్నారు. ఎవరైనా తమకు డబ్బు అందలేదని చెబితే వారి వివరాలను నమోదు చేసుకుంటున్నారు. వైసీపీ నాయకులు వలంటీర్ల ద్వారా ముందే సమాచారాన్ని సేకరించి క్రోడీకరించుకొని లిస్టులు తయారు చేశారు. ఆ లిస్టుల ప్రకారం డబ్బుల పంపిణీ జరుగుతోందని సమాచారం. నియోజకవర్గాల పరిధిలో ఫోన్ నంబరుతోసహా ప్రతి ఓటరు వివరాలు వైసీపీ నాయకుల చేతుల్లో ఉన్నాయి. వైసీపీ డబ్బు పంపిణీకి ఎక్కువగా పేదలు, మధ్య తరగతి ప్రజానీకం నివాసం ఉండే ఏరియాలను ఎంచుకుంది. అక్కడ ముందుగా డబ్బులు పంచుతున్నారు. తర్వాత మిగతా ప్రాంతాలకు వెళుతున్నారు. ఉదాహరణకు నారాయణపురం వాంబే కాలనీ, ఆ చుట్టుపక్కల మంగళవారం వైసీపీ ఓట్ల కొనుగోలుకు డబ్బులు పంపిణీ చేసింది. రెండు రోజుల్లో మిగతా ఇళ్లకు డబ్బులు వస్తాయని ఆ సమయంలో వైసీపీ నాయకులు చెప్పారు. దీంతో ఆ వార్డుల్లోని ప్రజలు ఓటరు స్లిప్పులతో ఎదురు చూస్తున్నారు.

ఓటుకు రూ.1500

రౌతులపూడి మండలంలో పంపిణీ

రౌతులపూడి, మే 8: వైసీపీ ఓటర్లకు డబ్బు పంపకం మొదలుపెట్టింది. ఒక్క ఓటుకు రూ.1500 వందలు ఇస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఎ.మల్లవరం, లచ్చిరెడ్డిపాలెం, గుమ్మరేగులతో పాటు కొన్ని గ్రామాల్లో ఇప్పటికే డబ్బులు పంచారు. సొమ్ములును బూత్ ఏజెంట్, బూత్ కన్వీనర్, రాజీనామా చేసిన వలంటీర్, అభ్యర్థి నియమించుకున్న ప్రతినిధితో పాటు పంచుతున్నారు. మిగిలిన గ్రామాల్లో రెండు రోజుల్లో పంచడానికి వైసీపీ నాయకులు ప్రణాళిక రచిస్తున్నారు.



మద్యం డంప్

కొత్తపల్లి, మే 8: కొత్తపల్లి మండల తీరప్రాంతాల్లో అక్రమంగా మద్యం స్టాక్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అధికార పార్టీకి చెందిన పలువురు హేచరీల్లో గుట్టుచప్పుడు కాకుండా భారీ స్థాయిలో మద్యాన్ని డంప్ చేసినట్టు తెలిసింది. ఒక పక్క రేయింబవళ్లు మండలంలో ప్రధాన సెంటర్లో చెకింగ్ పాయింట్లు ఏర్పాటు చేసినప్పటికీ తీర ప్రాంతం గుండా హేచరీల గొడౌన్‌లో భారీగా మద్యాన్ని నిల్వ చేయడం గమనార్హం.


తికమక 'బ్యాలెట్'

గోపాలపురం, మే 8: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల్లో పని చేసే సిబ్బందికి ఓటు ఎక్కడ వేయాలో మూడు రోజుల పాటు అర్థం కాక తికమకపడ్డారు. ఈ నెల 6వ తేదీ మొదటి రోజు బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాలలో, రెండో రోజు తహశీల్దార్ కార్యాలయంలో, మూడో రోజు బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించారు. అయితే తమ ఓటు హక్కు ఎక్కడ వినియోగించుకోవాలో అర్థం కాక పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు తికమకపడ్డారు. దీంతో తమ ఓటు ఎన్నికల్లో వినియోగించుకోలేమనే గందరగోళంలో ఉద్యోగులు ఉన్నారు. ఈసారి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ అర్థం కాని పరిస్థితుల్లో ముగిసింది.



మందుబాబుల పాట్లు

పి.గన్నవరం, మే 8: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం అమ్మకాలపై ఎన్నికల కమిషన్ రోజువారీ అమ్మకాలపై కొన్ని మార్గదర్శకాలను విధించింది. దీంతో నిబంధనలు ప్రకారం కొన్ని షాపుల్లో సాయంకాలం లోపులోనే అమ్మకాలు పూర్తవుతున్నాయి. దీంతో మద్యం కోసం మందుబాబులు పాట్లు పడుతున్నారు. ఈ క్రమంలోనే పి.గన్నవరంలో బుధవారం మూడు షాపుల్లో ఉండగా రెండు షాపుల్లో అమ్మకాలు పూర్తికాగా ఉన్న షాపుపై మద్యం కోసం మందుబాబులు ఎగబడ్డారు. స్థానికులు సైతం ఆ షాపు వద్ద సందడిని ఆసక్తిగా తిలకించారు. గత మూడు రోజులుగా వైసీపీ అభ్యర్థి డబ్బులు పంచడంతో మందు షాపులు కళకళలాడుతున్నాయని స్థానికులు చెప్పుకుంటున్నారు.



కారం బాపన్నదొర



చోడి మల్లికార్జునుడు



రత్నాబాయి



గొర్లె ప్రకాశరావు



చిన్నం జోగారావు



శీతంశెట్టి



చిన్నం బాబూరమేష్



తీర్పులో ప్రత్యేకం

అభ్యర్థుల కన్నా పార్టీ ఇమేజే కీలకం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఏకైక ఎస్టీ రిజర్వుడు నియోజకర్గం రంపచోడవరం. తొలుత భద్రాచలం ద్విసభ్య నియోజకవర్గం గానూ, తర్వాత ఎల్లవరం గానూ ప్రస్తుతం రంపచోడవరంగానూ మారింది. రాష్ట్రంలో వీచే ప్రతికూల, అనుకూల పవనాలకు సంబంధం లేకుండానే ఇక్కడి ఓటర్లు చెప్పే తీర్పు ప్రత్యేకం! ఓటర్ల మనోగతం పూర్తిగా తెలిసిన రాజకీయ పార్టీలు దీనిపై స్థిరమైన అభిప్రాయంతోనే ఉంటున్నాయి. అభ్యర్థులతో సంబంధం లేకుండానే పూర్తిగా పార్టీ ఇమేజీతోనే ఎన్నికలు సాగే నియోజకవర్గంగా రంపచోడవరాన్ని చెప్పుకోవచ్చు.

(రంపచోడవరం):

15 ఎన్నికల్లో..

ఇంత వరకు జరిగిన 15 ఎన్నికలను గమనిస్తే.. 1952లో కిసాన్ మజ్దూర్ పార్టీకి పట్టం కట్టిన ప్రజలు, 1955లో కమ్యూనిస్టు పార్టీకి పట్టం కట్టారు. ఈ రెండు దఫాల్లో అప్పట్లో తూర్పుగోదావరి పరిధిలోనే భద్రాచలం ఉండడంతో ఆ పేరుతోనే ఈ నియోజకవర్గం కొనసాగింది. ఇద్దరు సభ్యుల నియోజకవర్గంగా ఒక గిరిజనుడిని, మరో గిరిజనేతరుడిని ఎన్నుకోవాల్సి వచ్చేది. ఈ రెండు ఎన్నికల్లోనూ ఇద్దరు సభ్యుల్నీ క్రాస్ ఓటింగ్ లేకుండా ఒకే పార్టీ నుంచి ఎన్నుకోవడం విశేషం. వ్యక్తుల కంటే పార్టీలకే ఇక్కడి ప్రజల ప్రాధాన్యత అన్నది ఆదిలోనే రుజువు చేశారు. తర్వాత 1962లో జరిగిన పునర్విభజనలో ఎల్లవరం ప్రత్యేకంగా ఆవిర్భవించడంతో అప్పటి ఎన్నికల్లో ఇక్కడి ఓటర్లు కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. నాటి నుంచి 1978 వరకూ వరుసగా ఐదుసార్లు కాంగ్రెస్‌నే గెలిపించారు.



కోసూరి కాశీవిశ్వనాథ్



వంతల రాజేశ్వరి




నాగులాపల్లి ధనలక్ష్మి





ఏజెన్సీలో అందమైన దృశ్యాలు

భూపతిపాలెం రిజర్వాయర్..





టీడీపీకి కంచుకోట

1983 ఎన్నికల్లో ఇప్పటి మాదిరిగా ఎటువంటి ప్రచార మాధ్యమాలు లేకపోయినా ఎవరూ ఊహించని రీతిలో ఇక్కడ ఓటర్లు దివంగత ఎన్టీరామారావు పార్టీగా తెలుగుదేశానికి పట్టం కట్టారు. ఇప్పటికంటే దారుణమైన భౌగోళిక పరిస్థితులలో, సరైన మౌలిక సదుపాయాలు, సమాచారం వ్యవస్థ లేని రోజుల్లోనే తెలుగుదేశం లోతట్టు గిరిజన ప్రాంతాలకు చేరిపోయింది. అప్పటి నుంచి 2004 ఎన్నికల వరకూ జరిగిన ఆరు ఎన్నికల్లో తెలుగుదేశానికి ఏజెన్సీలో ఢోకా లేకుండా పోయింది. వరుస హ్యాట్రిక్ విజయాలు టీడీపీకి ఇక్కడ స్థిరమైన స్థానాన్ని కల్పించాయి. ఆ పరంపరలో ఈ స్థానం తెలుగుదేశానికి డబుల్ హ్యాట్రిక్‌ను తెచ్చిపెట్టగా ఒక శీతంశెట్టి వెంకటేశ్వరరావుకు హ్యాట్రిక్‌ను తెచ్చిపెట్టింది. 2004 ఎన్నికల్లో రాష్ట్రంలోనూ, దేశంలోనూ కాంగ్రెస్ గాలి వీచినా కూడా కొత్త అభ్యర్థి చిన్నం బాబూ రమేష్‌ను బరిలోకి దించి కూడా తెలుగుదేశమే ఈ స్థానాన్ని కైవసం చేసుకుంది.

2009 నుంచి పరిస్థితిలో మార్పు

2009 ఎన్నికల్లో ఊహించని రీతిలో తెలుగుదేశం పరాజయాన్ని చూసింది. కాంగ్రెస్ తరపున కోసూరి కాశీ విశ్వనాథ్ ఆ ఎన్నికల్లో విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ ఈ స్థానాన్ని కోల్పోగా రాష్ట్రమంతా తెలుగుదేశం విజయం సాధించినా ఇక్కడ మాత్రం రెండో మారు కూడా దేశం పరాజయాన్ని నమోదు చేసుకుంది. వైసీపీ అభ్యర్థిగా అనంత ఉదయభాస్కర్ బరిలోకి దిగగా ఆయన నామినేషను తిరస్కరణకు గురైతే ఊహించని రీతిలో ప్రత్యామ్నాయంగా తెరపైకి వచ్చిన వంతల రాజేశ్వరితోనే వైసీపీ విజయం సాధించింది. కాగా ఎన్నికలు గడిచిన మూడేళ్లకు రాజేశ్వరి ఊహించని రీతిలో తెలుగుదేశం కండువా కప్పుకుని వైసీపీకి ఝలక్ ఇచ్చారు. దీంతో 2019 ఎన్నికల్లో ఆమెనే తెలుగుదేశం నుంచి పోటీ చేయగా నాగులాపల్లి ధనలక్ష్మి అనే ఉపాధ్యాయురాలు వైసీపీ తరపున బరిలో దిగి విజయం సాధించారు. ఇపుడు కూడా వైసీపీ నుంచి ధనలక్ష్మే బరిలో ఉండగా తెలుగుదేశం కొత్త అభ్యర్థిగా అంగన్‌వాడీ టీచర్ అయిన మిరియాల శిరీషాదేవిని బరిలోకి దించింది. వీరితో పాటు సీపీఎం తరపు నుంచి లోతా రామారావు బరిలో ఉన్నారు.

1952 నుంచి 2019 వరకు ఎవరు ఏ పార్టీ నుంచి విజేతగా నిలిచారో సమగ్ర వివరాలు

సంవత్సరం	విజేత	పార్టీ
1952	కారం బాపన్నదొర(ఎస్టీ)	కిసాన్ మజ్దూర్ పార్టీ
	వై.వెంకటేశ్వరరావు	కిసాన్ మజ్దూర్ పార్టీ
1955	శ్యామల సీతారామయ్య(ఎస్టీ)	కమ్యూనిస్టు పార్టీ
	మహ్మద్ తహశీల్	కమ్యూనిస్టు
1962	చోడి మల్లికార్జునుడు	కాంగ్రెస్
1967	చోడి మల్లిఖార్జునుడు	కాంగ్రెస్
1972	టి.రత్నాబాయి	కాంగ్రెస్
1978	గొర్లె ప్రకాశరావు	కాంగ్రెస్
1983	చిన్నం జోగారావు	టీడీపీ
1985	చిన్నం జోగారావు	టీడీపీ
1989	శీతంశెట్టి వెంకటేశ్వరరావు	టీడీపీ
1994	శీతంశెట్టి వెంకటేశ్వరరావు	టీడీపీ
1999	శీతంశెట్టి వెంకటేశ్వరరావు	టీడీపీ
2004	చిన్నం బాబూరమేష్	టీడీపీ
2009	కోసూరి కాశీవిశ్వనాథ్	కాంగ్రెస్
2014	వంతల రాజేశ్వరి	వైసీపీ
2019	నాగులాపల్లి ధనలక్ష్మి	వైసీపీ

ఇంటర్వ్యూ

రాజోలు నియోజకవర్గంలో తాగునీటి సమస్యను తీరుస్తా



ప్రచారంలో అన్ని వర్గాల ప్రజలు ఆదరిస్తున్నారు
కూటమి నాయకులు, కార్యకర్తలు నా విజయానికి కృషి చేస్తున్నారు
డయాలసిస్ సెంటరు ఏర్పాటు చేస్తా
రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్

ప్రశ్న: ప్రచారం ఎలా సాగుతోంది?

వరప్రసాద్: చాలా ఉత్సాహంగా సాగుతోంది. ఏ గ్రామానికి వెళ్లినా ఓటర్ల నుంచి మంచి స్పందన వస్తోంది. మండుటెండను సైతం లెక్క చేయకుండా కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొంటున్నారు.

ఏ వర్గాల ప్రజలు ఎలా స్పందిస్తున్నారు?

ఎస్సీ, బీసీ, ఓసీ వర్గాల ప్రజలు బాగా స్పందిస్తున్నారు. బీసీ, ఎస్సీ ఆత్మీయ సమావేశాలకు ఆయా సామాజిక వర్గీయులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

మీకున్న గెలుపు అవకాశాలేమిటి. ఎందుకంత ధీమా?

గ్రామాల్లోని సమస్యలపై దృష్టి పెట్టాను. నేను పుట్టిన గడ్డకు సేవలందిస్తా. జీవితాన్ని పణంగా పెట్టి ప్రజలకు సేవ చేస్తాను. పవన్‌కల్యాణ్, చంద్రబాబు, మోదీ ఆశీస్సులతో కచ్చితంగా గెలుస్తా.

మెజార్టీ వర్గాల కోసం మీరేం చేయబోతున్నారు?

వైసీపీ ప్రభుత్వం ఎస్సీలకు 27 పథకాలను రద్దు చేసింది. ఎస్సీ, బీసీ పథకాలను పునరుద్ధరిస్తాం. చిన్న, మధ్య తరగతి పరిశ్రమలను తీసుకువచ్చి కాపులతో పాటు అన్ని వర్గాలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాను.

గత పాలకుల హయాంలో జరిగిన అన్యాయం ఏమిటి?

వైసీపీ ప్రభుత్వం విపరీతమైన నిర్లక్ష్యంతో వ్యవహరించింది. ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లేవారికి రక్షణ లేదు.

ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఏం చేయబోతున్నారు?

నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాను. ప్రజా సమస్యలన్నింటినీ తీర్చడమే ధ్యేయం.

గెలిచాక నియోజకవర్గంలో ఏ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తారు?

తాగునీటి సమస్య అధికంగా ఉంది. దానిని పరిష్కరిస్తాను. రాజోలులో డయాలసిస్ సెంటర్ లేకపోవడంతో బాధితులు దూర ప్రాంతాలకు వెళ్లడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. డయాలసిస్ సెంటర్‌ను తీసుకువస్తా.

కూటమి పార్టీల సహకారం ఎలా ఉంది?

టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు నా విజయానికి కృషి చేస్తున్నారు. సమన్వయంతో ముందుకు వెళ్తున్నాం.

ప్రచారంలో మీ కుటుంబ సభ్యుల సహకారం ఎలా ఉంది?

బాగానే ఉంది. మా అబ్బాయి నా తరఫున ప్రచారం చేస్తున్నాడు.

ఎన్నికల హామీలపై జన స్పందన ఏమిటి?

కూటమి ఎన్నికల మేనిఫెస్టో బ్రహ్మాండంగా ఉంది. అన్నివర్గాల ప్రజలతో పాటు పేద ప్రజలకు మరింత మేలు చేకూర్చేలా ఉంది. సంక్షేమానికి భరోసా కల్పిస్తూ అభివృద్ధికి పెద్దపీట వేశారు.

\- రాజోలు

ఘనంగా తలుపులమ్మ తల్లి జాతర

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



తునిరూరల్, మే 8: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానం ఆధ్వర్యంలో తలుపులమ్మ తల్లిజాతర కన్నుల పండువగా జరిగింది. లోవ కొత్తూరులో నిర్వహించిన ఈ జాతర మహోత్సవానికి పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ దేవతా మూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. బుధవారం సాయంత్రం లోవకొత్తూరులో నిర్వహించిన అమ్మవారి శోభాయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పంట నష్టంతో రైతు ఆత్మహత్య

రావులపాలెం, మే 8: చేతికి అందివచ్చిన పంట నష్టపోయిన కారణంగా ఓ రైతు మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై రావులపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రావులపాలెం మండలం కొమరాజులంకకు చెందిన ద్వారంపూడి బుచ్చిరెడ్డి(56)కి 40 సెంట్లు సొంత భూమి ఉండగా 3 ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. వ్యవసాయమే వృత్తిగా జీవనం సాగిస్తున్నాడు. అరటి పంట సాగు చేశాడు. ఈ నెల 7న ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం రావడంతో అరటితోట పంట నేలకొరిగింది. బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూసేసరికి పంటంతా నేలకొరిగి ఉండటంతో మనస్తాపానికి గురయ్యాడు. అక్కడే పురుగుల మందు తాగాడు. ఆ చెంతనే ఉన్న రైతులు చూసి ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ అంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ప్రతినిధులు

పాలిసెట్ ఫలితాల్లో తిరుమల విద్యార్థుల ప్రతిభ

రాజమహేంద్రవరం రూరల్ మే 8: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన పాలిసెట్ ఫలితాల్లో రాజమహేంద్రవరంలో గల తిరుమల పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్టు తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. జె.యశ్వంత్‌సాయి, సీహెచ్‌వీఎస్ఎస్ వర్షిణి 120 మార్కులకు 120 మార్కులు, జి.ప్రభవ్‌తేజ, డి.శ్రీవేద్ 120 మార్కులకు గాను 119 మార్కులు సాధించి స్టేట్ 7వ ర్యాంకు సాధించారన్నారు. చిట్టూరి త్రివేణి, ఈడుపుగంటి వంశీధర్, పదిలం వెంకట నాగ సూర్యధావన్ స్టేట్ 14వ ర్యాంకు, గన్నంనీడి వాత్సల్య స్టేట్ 21వ ర్యాంకు, మెకరాల కృష్ణ శ్రావణి సాకేత్, మంగు కిరణ్ సుబ్రహ్మణ్య స్టేట్ 24వ ర్యాంకు, యడ్లూరి కృష్ణ చైతన్య స్టేట్ 40వ ర్యాంకు, నల్లబోతుల షణ్ముఖ సాయినాథ్, మద్దు సూర్యదేవ్ చింతపల్లి భార్గవ శ్రీవెంకట గణేష్, దొండి ప్రీతిక శరణ్య స్టేట్ 42వ ర్యాంకు సాధించారన్నారు. టాప్ 20లో ఏడు ర్యాంకులు టాప్ 50లో 15 ర్యాంకులు, టాప్ 100లో 24 ర్యాంకులు సాధించి అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్లతో కలిసి తిరుమలరావు అభినందించారు.

నేను నికార్సయిన కాపుని

పవన్‌కల్యాణ్‌పై ముద్రగడ ఫైర్

కిర్లంపూడి, మే 8: తాను నికార్సయిన కాపునని, తన తండ్రి, తల్లి, కోడలు అందరూ కాపులేనని, మీ చరిత్ర బయటపెట్టాలని వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు సవాల్ చేశారు. చిన్నా చితక నటీనటులతో ప్రచారం చేయిస్తున్నారంటే ఓటమి తెలిసిపోయిందని విమర్శించారు. కాకినాడ జిల్లా కిర్లంపూడిలో ముద్రగడ బుధవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబునాయుడు కాపు ఉద్యమాన్ని అణిచివేశారన్నారు. తనను, తన కుటుంబాన్ని రోడ్డుకీడ్చారన్నారు. పవన్‌కల్యాణ్ హైదరాబాద్ నుంచి వస్తే ఇక్కడ పిఠాపురంలో పట్టం కట్టాలా అని ప్రశ్నించారు. తన కూతురికి తనకు మధ్య చిచ్చు పెట్టిన పవన్‌కల్యాణ్ వాళ్ల ఇంట్లో ఆడవాళ్ల కోసం ఎందుకు మాట్లాడలేకపోతున్నారని విమర్శించారు. పవన్‌కల్యాణ్ ఒప్పుకుంటే ఆయన మాజీ భార్యలు, ప్రస్తుత భార్యకు వైసీపీలో ఎమ్మెల్యే సీట్లు ఇప్పిస్తామన్నారు. పవన్‌కల్యాణ్ స్వచ్ఛమైన కాపు అయితే రికార్డు బయట పెట్టాలన్నారు. కాపు ముసుగులోకి కాపు వాడికి చేయరా అని కార్యకర్తలతో చెప్పిస్తున్నారని వంగా గీత కూడా కాపు కులస్తురాలేనన్నారు. ప్రజలు చప్పట్లు కొడుతుంటే పూనకం వచ్చి ఆవేశంతో పవన్‌కల్యాణ్ మాట్లాడుతున్నారన్నారు. సినిమాలో నటన ఇక్కడ చూపిస్తే జై కొట్టాలా అని ముద్రగడ ప్రశ్నించారు.



అల్లవరం మండలం బోడసకుర్రులో అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌కు హారతి ఇచ్చి పూలవర్షం కురిపిస్తున్న మహిళ





మామిడికుదురు మండలం పెదపట్నంలో దివ్యాంగునితో మాట్లాడుతున్న హరీష్‌మాధుర్, అయినవిల్లి మండలం మాగాంలో విద్యుత్ స్తంభంపై పంటకాల్వ దాటుతున్న హరీష్‌మాధుర్

కోనసీమను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తా

అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్

అమలాపురం టౌన్, మే 8: కోనసీమను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. పర్యాటక రంగంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని వనరులూ ఉన్నాయన్నారు. టెంపుల్ టూరిజాన్ని వృద్ధి చేయడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. అయినవిల్లి మండలం మాగాం, అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం గ్రామాల్లో పి.గన్నవరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణతో కలిసి హరీష్‌మాధుర్ బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాల్వపై వంతెనగా ఏర్పాటుచేసిన విద్యుత్ స్తంభంపై నడిచివెళ్లి మరీ ఓటర్లను కలుసుకుని ఓట్లు అభ్యర్థించారు. గంగుమళ్ల కాశీఅన్నపూర్ణ, వర్రే శేషుతో పాటు పలువురు పాల్గొన్నారు. అల్లవరం మండలం బోడసకుర్రులో అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు తనయుడు కరణ్‌తో కలిసి హరీష్‌మాధుర్ ఇంటింటా ప్రచారం చేశారు. మహిళలు పూల వర్షం కురిపించి హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. సైకిల్ గుర్తుపై ఓట్లువేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. నాయకులు చింతా శ్రీనివాస్, రొక్కాల విజయలక్ష్మి, రొక్కాల నాగేశ్వరరావు, కారాడి లక్ష్మణరావు, బస్వాని వెంకటేశ్వరరావు, కారాడి నాగరాజు, పెమ్మాడి రాఘవులు, చింతా నరసింహస్వామి, సంగాని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. గ్రామాల్లో రోజురోజుకూ వైసీపీ ఖాళీ అవుతోందని, టీడీపీకి ప్రజాదరణ పెరుగుతోందని హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. పెదపట్నం గ్రామంలో మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అమీర్ ఆధ్వర్యంలో వంద మంది ముస్లింలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. వారికి హరీష్‌మాధుర్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రాష్ట్రంలో రాబోయేది కూటమి ప్రభుత్వమేనన్నారు. నాయకులు నామన రాంబాబు, మొల్లేటి శ్రీనివాస్, బోనం బాబు, సుందరనీడి చిన్నీ, చుట్టుగుళ్ల కిశోర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చింతలమోరిలో నిర్వహించిన అగ్నికుల క్షత్రియుల ఆత్మీయ సమావేశంలో హరీష్‌మాధుర్, రాజోలు అసెంబ్లీ కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్ పాల్గొన్నారు. మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని హరీష్ పేర్కొన్నారు. మత్స్యకారుల జీవనోపాధిని పెంచే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ప్రచారంలో నాయకులు ముప్పర్తి నాని, డాక్టర్ రాపాక రమేష్‌బాబు, గెడ్డం సింహ, తిరుమాని ఆచార్యులు, మంగెన భూదేవి తదితరులు పాల్గొన్నారు. హరీష్‌కు ఘన విజయం చేకూర్చాలని హరీష్‌మాధుర్ సోదరీమణులు దీప్తి, రమ్య, కీర్తి మలికిపురం మండలం రామరాజులంకలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మహిళలకు బొట్లు పెట్టి మరీ ఓట్లు అభ్యర్థించారు. బందెల పద్మ తదితరులు పాల్గొన్నారు.





అల్లవరం మండలం బోడసకుర్రులో అసెంబ్లీ అభ్యర్థి ఆనందరావు కుమారుడు కరణ్‌తో కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్న హరీష్‌మాధుర్, మలికిపురం మండలం రామరాజులంకలో హరీష్ సోదరీమణుల ప్రచారం



పెదపట్నంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ సభ్యునికి టీడీపీ కండువా కప్పి ఆహ్వానించిన హరీష్‌మాధుర్



యెంట్రుకోనలో ఎన్నికల ప్రచారంలో ఆనందరావుకు హారతి ఇస్తున్న మహిళ

చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలతో పేదలకు మేలు

అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు

అల్లవరం, మే 8: చంద్రబాబు సీఎం అయ్యాక సూపర్‌సిక్స్ పథకాల ద్వారా పేదలకు మేలు జరుగుతుందని అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు అన్నారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు ఆధ్వర్యంలో మండలంలోని డి.రావులపాలెం, దేవగుప్తం, యెంట్రుకోన, అల్లవరం, కోడూరుపాడు గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఆనందరావు బుధవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్న ప్రజల కోరిక కొద్దిరోజుల్లోనే నెరవేరబోతోందన్నారు. రాష్ట్రాన్ని అప్పులపాల్జేసిన జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. అమలాపురం అసెంబ్లీని మెడల్ సెగ్మెంట్‌గా అభివృద్ధి చేస్తానన్నారు. గత టీడీపీ పాలనలో తాను ఎమ్మెల్యేగా దళితవాడలు, ఇతర ప్రాంతాల్లో వేసిన రహదారులపైనే వైసీపీ నేతలు ప్రచారం చేసుకుంటున్నారన్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమితో జగన్ ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకుందన్నారు. ప్రభుత్వ వ్యతిరేకతకు రైతులు, ఉద్యోగుల ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు. యెంట్రుకోన సహా పలు గ్రామాల్లో మహిళలు హారతులిచ్చారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రచారంలో మెట్ల రమణబాబు, ఆకుల లక్ష్మణరావు, తోలేటి నానాజీ, గుబ్బల రాంప్రసాద్, నార్గన శ్రీనివాసరావు, పోతల నాగరాజు, గుబ్బల నాగేశ్వరరావు, ఉంద్రు భగవాన్‌దాస్, ఈసకోను సాంబశివరావు, కంకిపాటి వీరబాబు, ఎస్.సుబ్బరాజు, ఎస్.సుదర్శనరావు, వేగిరాజు వెంకట్రాజు, గెద్దాడ శ్రీనివాస్, ఈతకోట కృష్ణబాబు, వంగా దొరయ్యనాయుడు, యాళ్ల బ్రహ్మానందం, ఈటి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: మైనార్టీలకు పన్నెండు రకాల సంక్షేమ పథకాలు ఎత్తివేసిన జగన్‌కుబుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్‌మీరాన్‌షరీఫ్ పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీల పక్షాన నిలబడి అండగా నిలిచేది కూటమి నేతలేనన్నారు. మైనార్టీలకు ద్రోహం చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. కూటమి అభ్యర్థులైన గంటి హరీష్‌మాధుర్, అయితాబత్తుల ఆనందరావులకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలన్నారు. అమలాపురంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మైనార్టీ సెల్ సమావేశంలో ఆనందరావు తనయుడు కరణ్, మైనార్టీ సెల్ ప్రతినిధులు మహ్మద్ బషీర్, ఎండీ అమీర్, షేక్ అబ్దుల్‌ఖాదర్, మీర్ ఖాశింహుస్సేన్‌బాబు, మహ్మద్ ఖాజా షరీఫుద్దీన్, షేక్ జహంగీర్, మహ్మద్ మోబిన్, మహ్మద్ షఫీఉల్లా, కరీముల్లాబాబా తదితరులు పాల్గొన్నారు.



దేవగుప్తంలో ఉపాధి కూలీలను ఓట్లు అభ్యర్థిస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థి ఆనందరావు



టీడీపీ మైనార్టీ సెల్ సమావేశంలో మాట్లాడుతున్న అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి ఆనందరావు తనయుడు కరణ్

కోనసీమ అల్లర్ల కేసులో స్టేతో వైసీపీకి గడ్డు పరిస్థితి

వైసీపీ సీనియర్ నాయకుడు మురళీకృష్ణ



అమలాపురం టౌన్, మే 8: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అధికార వైసీపీ గడ్డు పరిస్థితి ఎదుర్కొంటోందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వైసీపీ లీగల్ సెల్ మాజీ అధ్యక్షుడు మట్టపర్తి మురళీకృష్ణ పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలుతో ఎంతో బలంగా ఉండాల్సిన పార్టీకి ఈ పరిస్థితి రావడానికి కోనసీమ అల్లర్ల కేసులో స్టే తీసుకు రావడమే కారణమన్నారు. అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ బీసీ సెల్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కోనసీమ అల్లర్ల కేసులో అమాయకులను ఇరికించినట్టు మంత్రి పినిపే విశ్వరూప్‌తో పాటు ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ చెప్పడంతో పాటు పోలీసు ఉన్నతాధికారుల నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఆ కేసులను ఎత్తివేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. అల్లర్ల కేసులు ఎత్తివేయడం కుదరదని విశ్రాంత ఉద్యోగి జంగా బాబూరావుతో పాటు కొందరు హైకోర్టు నుంచి స్టే తీసుకురావడంతో జిల్లాలో వైసీపీకి ఎదురు దెబ్బ తగిలిందన్నారు. వెంకటాయపాలెం శిరోముండనం కేసులో తోట త్రిమూర్తులు స్టే తెచ్చుకోవడంతో ఆ కేసు విచారణ పూర్తి కావడానికి 36 ఏళ్లు పట్టిందన్నారు. కోనసీమ అల్లర్ల కేసులో అమాయకులైన నిరుపేద విద్యార్థులు, నిరుద్యోగులు ఇరుక్కుపోయారన్నారు. తోట త్రిమూర్తులు తరహాలో స్టే కొనసాగితే వారి భవిష్యత్తు ఏమిటని ఆయన ప్రశ్నించారు. వందలాది మంది విద్యార్థుల జీవితాలు నాశనం కాకుండా వారిని ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వ్యవహారంతో పాటు బీసీలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం, పూలే విగ్రహం ఏర్పాటు, బీసీలకు రక్షణ చట్టం తదితర అంశాలపై మంత్రి పినిపే విశ్వరూప్, అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు, వివిధ పార్టీల నాయకులకు వినతిపత్రాలు అందజేసినట్టు మురళీకృష్ణ తెలిపారు. సమావేశంలో బీసీ సెల్ నాయకులు వీరవల్లి చినబాబు, పిచ్చిప ప్రభాకర్, కాండ్రేగుల వరప్రసాద్, పలివెల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

లిక్కర్ గొడౌన్ పరిశీలన

అమలాపురం టౌన్, మే 8: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేకంగా నియమించిన పోలీసు పరిశీలకుడు ఎంపీ చంద్రకాంత్ బుధవారం అల్లవరం మండలం గూడాల, బోడసకుర్రు గ్రామాల్లోని క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం అమలాపురం బైపాస్ రోడ్డులోని ఏపీబీసీఎల్ లిక్కర్ గొడౌన్‌ను పరిశీలించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నాటి నుంచి మద్యం అమ్మకాల రికార్డులను చూశారు. ఆయన వెంట పట్టణ సీఐ కె.క్రిస్టఫర్, అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్ ఉన్నారు. ఎన్నికల ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా నిర్వహించిన దాడుల్లో ద్రాక్షారామ, మండపేట టౌన్ పోలీసుస్టేషన్ల పరిధిలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 28 డ్యూటీ పెయిడ్ లిక్కర్ బాటిళ్లు, 4.04 లీటర్ల ఐఎంఎల్ స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్టు ఎస్పీ ఎస్.శ్రీధర్ తెలిపారు.



కేంద్రంలో 'ఇండియా' కూటమి విజయం తథ్యం

సీడబ్ల్యుసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు

అమలాపురం టౌన్, మే 8: దేశంలో నిశబ్ధ విప్లవం నడుస్తోందని సీడబ్ల్యుసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలైన యూపీ, మధ్యప్రదేశ్‌ల్లో సైతం కాంగ్రెస్ భాగస్వామ్య పార్టీలు విజయం సాధించడం తథ్యమన్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు జరిగిన మూడు విడతల పోలింగ్‌లో కాంగ్రెస్‌దే ఆధిక్యమని స్పష్టంచేశారు. అమలాపురంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ఓటు వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో 'ఇండియా' కూటమి అధికారంలోకి రావాల్సిన చారిత్రక అవసరం ఏర్పడిందన్నారు. బీజేపీకి జగన్ ప్రభుత్వం అంటకాగుతోందన్నారు. ఇండియా కూటమి 300 స్థానాలు పైచిలుకు విజయం సాధించడం తథ్యమన్నారు. రాష్ట్రంలో వైసీపీ నియంతృత్వ పాలన సాగుతోందని విమర్శించారు. ఓట్లు కొనే ఆలోచనతో ఆ పార్టీ ఉందన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కూడా ఓటుకు డబ్బులిచ్చేలా చూడడం ఆ పార్టీ దారుణ పరిస్థితికి నిదర్శనమన్నారు. సమావేశంలో అమలాపురం కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి జంగా గౌతమ్, అసెంబ్లీ అభ్యర్థులు అయితాబత్తుల సుభాషిణి, పాలెపు ధర్మారావు, నాయకులు చీకట్ల అబ్బాయి, యార్లగడ్డ రవీంద్ర, వంటెద్దు బాబి, సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు, టీడీపీ కూటమికి మధ్యే పోటీ జరుగుతోందన్నారు. అనంతరం అంబాజీపేట సెంటరు నుంచి అమలాపురం వరకు కాంగ్రెస్ జిల్లా శాఖ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో రోడ్‌షో నిర్వహించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రుద్రరాజు

పోస్టల్ బ్యాలెట్ వేసిన రిటర్నింగ్ అధికారి సుధాసాగర్

అమలాపురం టౌన్, మే 8: రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎస్.సుధాసాగర్ బుధవారం అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు.



కూటమి అభ్యర్థుల కోసం దండోరా నాయకుల ప్రచారం

పి.గన్నవరం, మే8: ఎంపీఅభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే అభ్యర్థి గిడ్డి సత్యనారాయణలను గెలిపించాలని కోరుతూ లంకలగన్నవరం, నాగుల్లంక, కె.ఏనుగుపల్లి, మానేపల్లి, వాడ్రేవుపల్లి గ్రామాల్లో మాదిగపల్లెల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో సీనియర్ దండోరా నాయకులు మల్లవరపు సత్తిబాబు, టీడీపీఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుమర్తి ఆశీర్వాదం, బీజేపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్సీ మోర్చా జోనల్ అధ్యక్షుడు కొల్లి సూర్యారావు, గంపల సత్యప్రసాద్, సవరపు అబ్రహం పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు కూటమి అవసరం

ముమ్మిడివరం, మే 8: రాష్ట్రంలో అరాచక వైసీపీ పాలనను అంతమొందించి ప్రజలకు సుపరిపాలన అందించేందుకు కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. బుధవారం ముమ్మిడివరం నగర పంచాయతీ 15వ వార్డు క్రాపచింతలపూడిలో కౌన్సిలర్ మాదాల నాగసత్యమంగాకుమారి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ మేనిఫెస్టోను ఓటర్లకు అందించి ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు బుచ్చిబాబు, హరీష్‌మాధుర్‌లకు సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు.

కూటమికి అన్నికులాలు, అన్నివర్గాల ప్రజల మద్దతు




దుగ్గుదూరులో కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్‌కు గజమాలతో సన్మానం, దుగ్గుదూరులో సుభాష్ అభివాదం




కాజులూరులో మాట్లాడుతున్న వాసంశెట్టి సుభాష్, దుగ్గుదూరులో సుభాష్‌కు హారతిఇచ్చి బొట్టు పెడుతున్న మహిళ



సుభాష్ సమక్షంలో టీడీపీలో చేరిన భీమక్రోసుపాలెం ఎంపీటీసీ, తదితరులు

కాజులూరు, మే 8: రావణ రాజ్యం పోవాలంటే సైకిల్‌గుర్తుకు ఓటు వేయాలని రామచంద్రపురం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ కోరారు. దుగ్గుదూరు, కాజులూరు, శీల గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు సుభాష్‌కు ఘనస్వాగతంపలికారు. యువకులు పువ్వులు జల్లుతూ, మహిళలు హారతులు పడుతూ సుభాష్‌కు ఆహ్వానం పలికారు. ఈసందర్భంగా దళితవాడల్లో అంబేడ్కర్ విగ్రహాలకు సుభాష్ పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, పవన్,మోదీల కలయికతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. అన్ని కులాల, అన్నివర్గాల ప్రజల మద్దతు కూటమికి ఉందని ధీమా వ్యక్తం చేశారు.

ఐదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం

ఐదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యమని రామచంద్రపురం నియోజకవర్గం కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ ఆరోపించారు. బడుగు, బలహీన వర్గాలకు కనీసం ఒక్క రుణం కూడా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా మారి నిత్యం ప్రజలు ప్రమాదాల బారి నపడుతున్నారన్నారు. వైసీపీ పాలనలో నియోజకవర్గం మరింత వెనుకబడిందన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, బీజేపీ ఇన్‌చార్జ్ దూడల శంకరనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు పేపకాయల బబ్జి, మాజీ ఎంపీపీ యాళ్ల కృష్ణారావు, సర్పంచ్ టి.వెంకటలక్ష్మిజ్యోతికుమార్, కోమలి వెంకటరమణ, అన్నం శ్రీరామచంద్రమూర్తి, గుబ్బల ఏసురాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన భీమక్రోసుపాలెం ఎంపీటీసీ

ద్రాక్షారామ, మే 8: భీమక్రోసుపాలెం స్వతంత్ర ఎంపీటీసీ యన్నం దేవి, పలువురు వైసీపీ కార్యకర్తలు బుధవారం కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి సుభాష్ కండువాలు వేసి పార్టీలోకి చేర్చుకున్నారు. జడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, టీడీపీ నాయకుడు టేకుమూడి సత్యనారాయణ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులు, నాయీబ్రాహ్మణులకు అండగా కూటమి



నాయీబ్రాహ్మణుల సమావేశంలో మాట్లాడుతున్న వేగుళ్ల

మండపేట, మే8: టీడీపీ కూటమి ప్రభుత్వం నాయీబ్రాహ్మణులు, విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి కట్టుబడి ఉందని మండపేట నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చెప్పారు. టీడీపీ ఎప్పుడూ బీసీల పక్షపాతని అన్నారు బీసీలే టీడీపీకి వెన్నెముక అన్నారు.స్థానిక సీతారామ కల్యాణ మండపంలో బుధవారం నాయీబ్రాహ్మణులు, విశ్వబ్రాహ్మణుల సంఘాల నాయకులతో వేర్వేరుగా వేగుళ్ల సమావేశం అయ్యారు. విశ్వానికే బ్రహ్మ విశ్వబ్రాహ్మణు లన్నారు. వైసీపీ ప్రభుత్వంలో స్వర్ణకారుల జీవన స్థితి దుర్భరమైందన్నారు. స్వర్ణాభరణాలు చేసే పనివారికి గుదిబండగా మారిన 272 జీవోను కూటమి ప్రభుత్వం రాగానే రద్దుచేస్తామన్నారు. ఎమ్మెల్సీ తోట గొల్లపుంతలో రూ.కోట్లు విలువైన భూములను కేవలం రూ.1.5కోట్లకే కొనుగోలు చేసి రైతులను మోసం చేశాడని ఆరోపించారు. నాయీబ్రాహ్మణులకు కార్పొరేషన్ ఏర్పాటుచేసి, నిధులు అందించడం, జనాభా ప్రాతిపదికన పదవులు ఇస్తామన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే బీసీలకు పెద్దపీట వేసి, వారి అభ్యున్నతికి చేయూత ఇస్తామన్నారు. విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు, నాయీబ్రాహ్మణ సంఘ నాయకులు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం వస్తే రైలు కూత: సప్తగిరి



అంబాజీపేట, మే 8: కోనసీమకు రైల్వే సాధన కోసం పి.గన్నవరం నియోజకవర్గ ప్రజలంతా కూటమి నాయకులకు ఓటు వేయాలని సినీకమిడియన్, జనసేన పార్టీ స్టార్ క్యాంపెనర్ సప్తగిరి అన్నారు. అంబాజీపేట సెంటర్‌లో పి.గన్నవరం అసెంబ్లీ అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ గుర్తు గాజు గ్లాసు, లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ గుర్తు సైకిల్‌పై ఓటు వేయాలని అభ్యర్థించారు. కూటమి ప్రభు త్వం అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. సినీడైలుగులతో ఓటర్లను ఉత్తేజపరిచారు.

వేగుళ్లకు నందికోళ్ల రాజు మద్దతు



మండపేట, మే 8: మండపేట నుంచి నవతరం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నందికోళ్ల రాజు బుధవారం మండపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావుకు మద్దతు ప్రకటించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో వేగుళ్లను కలిసిన రాజు కలిశారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను చరమగీతం పాడేందుకు తమ పార్టీ కూటమికి మద్దతు ఇస్తుందని రాజు తెలిపారు.

మద్యం పట్టివేత

రాయవరం, మే 8: స్థానిక జమీందార్ కాలనీ సమీపంలో కారు షెడ్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 16కేసుల నిబ్ బాటిళ్లను (గోవా మద్యం) బుధవారం రాత్రి ఎస్ఎస్ టీం అధికారిణి కె.మేరి సంపూర్ణ, తహశీల్దారు కృష్ణారావు, ఆర్ఐ స్వాధీనం చేసుకున్నారు.

వీధి వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి

మండపేట, మే 8: మండపేటలోని తోపుడుబండ్లు, వీధివ్యాపారుల సమస్యలు పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుదని కూటమి అభ్యర్థి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు వ్యాపారులకు భరోసా ఇచ్చారు. స్థానిక ఏడిద రోడ్డులో తోపుడు బండ్లు, వీధివ్యాపారులతో బుధవారం నిర్వహించిన సమా వేశంలో ఆయన మాట్లాడారు.

కూటమి విజయం తథ్యం

మామిడికుదురు, మే 8: రాష్ట్రంలో కూటమి విజయం తథ్యమని పి.గన్నవరం నియోజకవర్గ టూమెన్ కమిటీ నామన రాంబాబు అన్నారు. బుధవారం మాకనపాలెంలో వైసీపీకి చెందిన పలువురు టీడీపీలో చేరడంతో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక శెట్టింవారి మెరకకు చెందిన 40మంది టీడీపీలో చేరారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం: దేవ వరప్రసాద్





ఈదరాడలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి ఓట్లు అభ్యర్థిస్తున్న కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్, తాటిపాకలో ప్రచారం నిర్వహిస్తున్న వరప్రసాద్

మామిడికుదురు, మే 8: రాష్ట్రాభివృద్ధి కూటమితోనే సాధ్యమవుతుందని రాజోలు నియోజకవర్గ కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. మామిడికుదురు మండలం ఈదరాడ, రాజోలు మండలం తాటిపాక, మలికిపురంలో ప్రచారం నిర్వహించి ప్రజల నుంచి వచ్చిన వినతులు స్వీకరిస్తూ, ఓట్లు అభ్యర్థిస్తూ ప్రచారంలో ముందుకు సాగారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంకుశ పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని, ప్రజలందరూ కూటమి పాలన కోసం ఎదురుచూస్తున్నారన్నారు. రాజోలు నియోజకవర్గాన్ని ఒక ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేస్తానని, తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే రాజోలును ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. ప్రధానంగా నియోజకవర్గంలో ఉన్న తాగునీటి సమస్యతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. బీసీలకు 50ఏళ్లకే పెన్షన్, ప్రత్యేక రక్షణ చట్టం తదితర సంక్షేమ పథకాలు ఏర్పాటు ద్వారా కూటమి ప్రభుత్వం పెద్దపీట వేయనున్నట్టు అన్నారు. పజలు ఓటు ద్వారా వైసీపీని ఇంటికి సాగనంపాలన్నారు. బీసీ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సంక్షేమం పాట పాడుతున్న వైసీపీ ధరలు విపరీతంగా పెంచి ఇచ్చిన సొమ్ముకు రెండింతలు దోచుకున్న వైనాన్ని ప్రజలు గమనించారన్నారు. నాసిరకం మద్యంతో ఎందరో ప్రాణాలను బలితీసుకున్న చరిత్ర జగన్‌కు దక్కిందన్నారు. ఆయన ప్రచారానికి ప్రజలు, మహిళలు బ్రహ్మరథం పట్టారు. మలికిపురం మండలం గుడిమెల్లంక నుంచి మలికిపురం వరకు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయాకార్యక్రమాల్లో రుద్రరాజు పద్మరాజు, నామన రాంబాబు, కేతా శ్రీనివాస్, ఎంపీ సత్యవాణి, కాకి లక్ష్మీదేవి, గుండుబోగుల పెదకాపు, మంగెన భూదేవి, అడబాల యుగంధర్, బిక్కిన వీరాస్వామి, బోనం నాగేశ్వరరావు, రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, గుబ్బల శ్రీనివాస్, సర్పంచ్ కోటిపల్లి రత్నమాల, కట్టా సూరిబాబు, చిట్టూరి సంతోష్, బోనం ఫణికుమార్, రాపాక నవరత్నం, కోటిపల్లి రత్నమాల, భూపతిరాజు సాయిబాబురాజు, మొల్లేటి శ్రీనివాస్, చుట్టుగుళ్ల లక్ష్మి, మద్దాల పెద్దకాపు, వర్ధినేని వెంకట్రామయ్య, లంకే శ్రీనివాస్, చిక్కం రాంబాబు పాల్గొన్నారు.



ఈదరాడలో అంబేడ్కర్‌కు నివాళులర్పించి ఓట్లు అభ్యర్థిస్తున్న వరప్రసాద్



తాటిపాకలో మాట్లాడుతున్న వరప్రసాద్

వైసీపీ అరాచక పాలనను ఓటుతో ఇంటికి పంపండి





మండపేటలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు, మెర్నిపాడు, ఏడిద గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేస్తున్న వేగుళ్ల జోగేశ్వరరావు కుమార్తెలు

మండపేట కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, మే 8: కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే వేగుళ్ల జోగే శ్వరరావు బుధవారం బైక్‌ర్యాలీగా మండపేటలో ఎన్నికల ప్రచారం చేశారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు ఓటనే వజ్రాయుధంతో ఇంటికి పంపించాలన్నారు. రాష్ట్రాభివృద్ధి, యువత భవిష్యత్ కోసం ప్రజలంతా కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజల ఆస్తులకు, మహిళలు, దళితులకు రక్షణ లేదన్నారు. శిరోముండనం కేసులో శిక్ష పడిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు దళితులంటే చులకన అన్నారు. దళితులంతా ఓటుతో తోటను ఓడించి ఎక్కడి నుంచి వచ్చారో అక్కడకు పంపాలన్నారు. స్థానిక 23,24,25,26,27,28 వార్డులో వేగుళ్ల ప్రచారం నిర్వహించారు. ప్రశాంతమైన మండపేటలో కులాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందాలనుకుంటున్న తోట ఆటలు ఇక్కడ సాగవన్నారు. కేశవరంలో గ్రావెల్ దోపిడీ చేసి కోట్లు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన ఘనుడు ఎమ్మెల్సీ తోట అని వేగుళ్ల ఆరోపించారు. లంక గ్రామాలకు రక్షణగా ఉండే కపిలేశ్వరపురం మండలం తాతపూడి గోదావరిలో పెరుగులంకను తవ్వేసి కోట్లు దోచుకున్నాడని ఆరోపించారు. నియోజకవర్గంలో ఇసుక గ్రావెల్, దోపిడీకి పాల్పడే తోట కావాలా లేదా అభివృద్ధి చేసేతాను కావాలో ప్రజలు తేల్చు కోవాలన్నారు. పట్టణంలో టిడ్కో గృహాలు టీడీపీ హయాంలో పూర్తిచేస్తే నేటి వరకు అక్కడ మౌలిక వసతులు కల్పించలేని అసమర్థ ప్రభుత్వం వైసీపీ అని వేగుళ్ల ధ్వజమెత్తారు. కేవలం తాము నిర్మించిన పూర్తి చేసిన టిడ్కో గృహాలకు రంగులు మార్చటం తప్ప చేసిందేమి లేదన్నారు. 13న జరిగే ఎన్నికల్లో తనను, అమలాపురం ఎంపీ అభ్యర్థి హరీష్ మాధుర్‌లకు ఓట్లు వేసి గెలిపించాలని వేగుళ్ల కోరారు. మండపేట నియోజకవర్గం నుంచి అరాచర కశక్తులను తరిమికొట్టాలని వేగుళ్ల పిలుపు నిచ్చారు. టీడీపీ ప్రభుత్వంలో మండపేట మున్సిపాల్టీ జాతీయస్థాయిలో గుర్తింపు పొందితే, ఇప్పుడు వైసీపీ ప్రభుత్వంలో పట్టణంలో సాధించిన అభివృది ఏమిలే దన్నారు. తమ ప్రభుత్వంలో నిర్మించిన క్రిస్టియన్ కమ్యూ నిటీహాల్, మహిళాశక్తి భవనం నేటికి ప్రారంభించ లేదన్నారు. ప్రచారంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, సహకార సంఘ మాజీ అధ్యక్షుడు మల్లిపూడి గణేశ్, జనసేన నాయకుడు నామాల చంద్రరావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కోటిపల్లి సాయిరాం, కూటమి నేతలు, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.




మండపేటలో కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు విజయం కోరుతూ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యాలు

వేగుళ్ల కుమార్తెలు, కుటుంబ సభ్యుల ప్రచారం

కూటమి అభ్యర్థి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు విజయం కోరుతూ ఆయన కుమార్తెలు మెర్నిపాడు, ఏడిద గ్రామాల్లో బుధవారం ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్‌ప్రయాణం, ఏడాదికి 3 గ్యాస్‌సిలిండర్లు, అర్హులందరికి రెండుసెంట్ల ఇంటి స్థలం, ఇంటిరుణం, నిరుద్యోగభృతి అందిస్తుందన్నారు. ప్రచారంలో వారు మహిళా ఓటర్లకు బొట్టుపెట్టి తమ తండ్రి వేగుళ్లను నాల్గవసారి మండపేట నియోజకవర్గం నుంచి గెలి పించాలని కోరారు. కూటమి ప్రభుత్వంతోనే అన్నివర్గాలకు మేలు జరుగుతుందన్నారు. స్థానిక నేతలు, మహిళలు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి అరాచకానికి కాలం చెల్లింది





కాట్రేనికోన మండలం పల్లం, చిర్రయానాం, నీలరేవు, గచ్చకాయలపొర, రాజానగరం గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అసెంబ్లీ అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు ఎన్నికల ప్రచార దృశ్యాలు

ముమ్మిడివరం కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు

కాట్రేనికోన, మే8: వచ్చేది కూటమి ప్రభుత్వమేనని, వైసీపీ ఓటమి తథ్యమని ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు అన్నారు. జగన్‌రెడ్డి అరాచక పాలనకు కాలం చెల్లిందన్నారు. బుధవారం పల్లం, చిర్రయానాం, నీలరేవు, గచ్చకాయలపొర, రాజానగరం, నాగపట్నం, మర్రిచెట్టు కాలని, కాపులపాలెం, రేవువారిపేట, పిల్లివానిగరువు తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి పాలనలో రాష్ట్రాభివృద్ధితో పాటు ముమ్మిడివరం నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. పిలిస్తే పలికే నాయకత్వాన్ని ప్రజలు ఎన్నుకోవాలన్నారు. బీసీ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బీసీలకు 50ఏళ్లకే పెన్షన్, ప్రత్యేక రక్షణ చట్టం తదితర సంక్షేమ పథకాలు ఏర్పాటు ద్వారా కూటమి ప్రభుత్వం పెద్దపీట వేయనున్నట్టు అన్నారు. ప్రత్యర్థి కులాల మధ్య చిచ్చురేపే వ్యాఖ్యలుచేస్తూ ఓట్లు దండుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని అన్నారు.సంక్షేమం పాట పాడుతున్న వైసీపీ ధరలు విపరీతంగా పెంచి ఇచ్చిన సొమ్ముకు రెండింతలు దోచుకున్న వైనాన్ని ప్రజలు గమనించారని అన్నారు. మద్యనిషేధం హామీతో పదవి సాధించి అనంతరం సొంతంగా సారా వ్యాపారాన్ని విచ్చలవిడిగా సాగిస్తున్న తీరుకు మహిళలు జగన్ పట్ల వ్యతిరేకంగా ఉన్నారని, వారంతా ఈఎన్నికల్లో కూటమికి ఓటేసేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. నాసిరకం మద్యంతో ఎందరో ప్రాణాలను బలితీసుకున్న చరిత్ర జగన్‌కు దక్కిందన్నారు. ప్రజలు ఓటు ద్వారా వైసీపీని ఇంటికి సాగనంపాలన్నారు. సైకిల్ గుర్తుకు ఓటేసి తనను అధిక మెజారిటీతో గెలిపిస్తే నియోజకవర్గంలో సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానన్నారు. తీరగ్రామాల్లో బుచ్చిబాబుకు ప్రజాదరణ లభించింది. మహిళల సానుకూలంగా స్పందించడంతో కూటమి నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు. కార్యక్రమంలోటీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, నడింపల్లి సుబ్బరాజు, సూదా బాబూరావు, త్సవటపల్లి నాగు, త్సవటపల్లి నాగభూషణం, బసవా మురళి, దాట్ల బాబు, దండుప్రోలు సత్యం, బొమ్మిడి లింగేశ్వరరావు, ఓలేటి మార్రాజు, దండుప్రోలు బాలయ్య, మల్లాడి అన్నవరం,అంగిని నరసింహమూర్తి, కర్రి కాశీరాజు, చెల్లి సురేష్, రంబాల రమేష్, త్సవటపల్లి రాము, సలాది నానాజీ, నంద్యాల వెంకటేశ్వరరావు, నామా వెర్రిబాబు, గిడ్డి చంటి, నంద్యాల చంటి, పొద్దోకు బాలు, బోనం కృష్ణ, రంబాల చౌదరిబాబు, మోకా బాలప్రసాద్, కోటిపల్లి సత్యనారాయణ, మోకా లోవరాజు, సత్తాల ప్రసాద్, వెంట్రు సుధీర్, వాసంశెట్టి రాజేశ్వరరావు, మొల్లేటి శ్రీహరి, గుత్తుల మహాలక్ష్మిశ్రీనివాస్, సుంకర నాగేశ్వరరావు, త్సవటపల్లి భాస్కరవెంకటనారాయణస్వామి, మంతెన శ్రీను రాజు, ఉచ్చుల నారాయణమూర్తి, గాలిపల్లి శ్రీనివాసరావు, కాయల బలరామ్, త్సవటపల్లి శ్రీను, నంద్యాల బాబి, సూదా దొరబాబు, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, బాలుయాదవ్, విక్టర్ పాల్గొన్నారు.




కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరికలు

కూటమితోనే అన్నివర్గాల ప్రజల పురోభివృద్ధి




సోదరుడు బండారు శ్రీనివాస్‌తో కలిసి బండారు సత్యానందరావు ప్రచారం, ప్రచారంలో బండారుకు మహిళలు హారతులు ఇస్తున్న దృశ్యం

కొత్తపేట, మే 8: వైసీపీ అరాచక పాలనలో తీవ్రంగా నష్టపోయిన అన్నివర్గాల ప్రజల ఆర్థిక పురోభివృద్ధికి, అభ్యున్నతికి పాటుపడతానని కూటమి అసెంబ్లీ అభ్యర్థి బండారు సత్యానందరావుఅన్నారు. కొత్తపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రజాగళం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోకి వచ్చిన బండారుకు నాయకులు స్వాగతం పలకగా మహిళలు దిష్టితీసి హారతులు ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలన కారణంగా కొత్తపేట నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోకపోవడంతో పాటు పేద, మధ్య తరగతి అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు తీవ్రఇబ్బందులుఎదుర్కొన్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాలాభివృద్ధికి పాటుపడతానన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసి నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కృషిచేస్తానన్నారు. సైకో పాలనలో అభివృద్ధిలో వెనుకబడిన నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. తనను గెలిపించి ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలన్నారు. వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చేందుకు ప్రజలు కంకణం కట్టుకోవాలన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అభివృద్ధి తప్ప కొత్తగా చేసిన అభివృద్ధి ఏమీలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని మూరుమూల ప్రాంతాలతో పాటు ప్రధాన గ్రామాలను అన్ని విధాల అభివృద్ధి చేస్తానన్నారు. గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పనకు విశేష కృషి చేస్తానన్నారు.



రావులపాలెం టీడీపీ కార్యాలయం వద్ద విద్యార్థులతో బండారు

కళలకు రెక్కల పథకం ఆడ బిడ్డలకు వరం

రావులపాలెం/కొత్తపేటమే8:టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టోలోని ఆడబిడ్డలకు రెక్కల పథకం ఎంతో అండగా ఉంటుందని కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. బుధవారం ఆయన తనను కలిసిన యువతులతో మాట్లాడుతూ... ఆడబిడ్డల చదువు ఆర్థిక కారణాలతో ఆగకుండా చూడడమే ఈపథకం ఉద్దేశ్యమన్నారు. దేశంలో ఎక్కడైనా తమకు నచ్చిన కోర్సులు చదవడానికి యవతులు తీసుకునే రుణానికి ప్రభుత్వం హామీదారుగా ఉంటుందన్నారు. తీసుకున్న రుణంపై కోర్సు కాలానికి వడ్డీని సైతం కూటమి ప్రభుత్వమమే భరిస్తుందన్నారు. 92612 92612 నెంబరుకు మిస్డ్ కాల్ ఇస్తే రిజిస్ట్రేషన్ లింక్ పొంది తద్వారా నమోదు చేసుకోవచ్చని బండారు చెప్పారు.